
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



ఉపాధ్యాయుడు నిత్యాన్వేషి

- విద్యార్థులను తీర్చిదిద్దేది పంతుళ్లే
- విద్యకు పేదరికం అడ్డుకాకూడదు
- గురుపూజోత్సవంలో కలెక్టర్ శివశంకర్
- వేడుకగా ఉపాధ్యాయ దినోత్సవం
- 79 మంది ఉపాధ్యాయులకు సత్కారం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 5: ప్రతి ఉపాధ్యాయుడు నిత్యాన్వేషిగా ఉంటూ సరికొత్త బోధనా మెళకువలతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సభాభవనంలో జిల్లావిద్యా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరుతో పాటు ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రామగోపాల్‌రెడ్డి, డీఈఓ అనురాధ, యూనియన్ బ్యాంకు ఆర్ఎం లక్ష్మితులసి హాజరయ్యారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ఆదర్శప్రాయుడని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఉపాధ్యాయుడు నిత్యాన్వేషిగా ఉంటూ బోధనా మెళకువలతో సరికొత్త బోధనలు చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. తాను ఈ స్థాయికి ఎదిగానంటే అది ఉపాధ్యాయులవల్లే అన్నారు. తన చిన్ననాటి ఉపాధ్యాయులను గుర్తు చేసుకుంటూ జీవితంలో ఉపాధ్యాయుడిని మరవరాదని, నిరంతరం సత్సంబంధాలు ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ పిల్లలుగా భావించి మనసు పెట్టి బోధించాలని సూచించారు. సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి అనుకున్నది సాధించాలంటే పేదరికం అడ్డు కాకూడదని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం చైతన్యానికి చిహ్నం అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థితికి వచ్చేలా విద్యను బోధించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రుల తరువాత గురువుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం జిల్లాలోని 79 మంది ఉపాధ్యాయులకు సన్మాన సత్కారాలు కలెక్టరు, ఎమ్మెల్సీ చేతుల మీదుగా జరిగాయి.



ఉపాధ్యాయ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉప విద్యాధికారులు క్రిష్ణప్ప, రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓలు గంగిరెడ్డి, జాఫర్‌సాదిక్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ శివశంకర్, డీఈవో అనురాధ చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు రమాదేవి



జెమీదాఖాన్ | సాంబశివారెడ్డి | బాల అంకిరెడ్డి | విజయభాస్కర్‌రెడ్డి | పెంచలయ్య | జయప్రకాశ్‌రెడ్డి | విజయభాస్కర్‌రెడ్డి | సత్యబాబు | శివమునెమ్మ | రామాంజనేయరెడ్డి | నాగకుమారి | కుమారస్వామి | ప్రమీల | గాయత్రి



వెంకటలక్ష్మి | రహిమాన్ | జాఫర్ | నాగేశ్వర్‌రావు | యానాదయ్య | వెంకటనారాయణ | బాల ఓబులేసు | వినోద్‌బాబు | నాగేంద్రకుమార్ | వెంకటకృష్ణారెడ్డి | చంద్రమోహన్‌రెడ్డి | అబ్దుల్ కరీం | మురళీకృష్ణ | తులసిలక్ష్మి | స్వరూపరాణి | వెంకటగిరి



దామోదర్‌రాజు | గోవర్ధన్ | నూరుల్లా అమీన్ | రామ్మోహన్‌రెడ్డి | షేక్ అబ్దుల్‌లతీఫ్ | లక్ష్మి | వీరారెడ్డి | బాల సుబ్బరాయుడు | భారతి | నాగరాజు | సుబ్రమణ్యం | సత్యవతి | యాహియాభాను | వెంకటరత్నమ్మ | మహానంది | శ్రీనివాసులు



సి.శ్రీనివాసులు | అస్లాం | వెంకటేశ్వర్లు | అరుణ | బోగేశ్వరయ్య | పర్వీన్‌భాను | అనసూయ | ఓబులేసు | నరసింహులు | రామిరెడ్డి | వరలక్ష్మీదేవమ్మ | దామోదరుడు | నిజాముద్దీన్ | మాధవ్ | బోగాది | బాబిహీరా



ఖాదర్‌బాష | చంద్రవతి | రామక్రిష్ణారెడ్డి | నాగిరెడ్డి | నిర్మల | హరితరెడ్డి | విజయలక్ష్మి | రవికాంత్ | రేణుకాదేవి | ప్రవీణ్‌కుమార్ | ప్రసన్నకుమారి | దీప | విజయ | నాగమల్లేశ్వరి | సులోచన | భారతి

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలపై

ఫిర్యాదులు వస్తే చర్యలు

- ఐదు ఆసుపత్రులకు రూ.1.54 లక్షల జరిమానా : కలెక్టర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 5: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఆరోగ్య సేవలు పొందిన వారి నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తప్పవని కలెక్టర్ లోతేటి శివశంకర్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. ఐవీఆర్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులపై సంబంధిత ఆసుపత్రులయాజమాన్యంతో కలెక్టర్ విచారణ చేసి జరిమానా విధించారు. కడపలోని హోలిస్టిక్, తిరుమల, సన్‌రైజ్ ఆసుపత్రులు, ప్రొద్దుటూరులోని కేవీఆర్ ఆసుపత్రి, పులివెందులలోని రాజా రాఘవేంద్ర ఆసుపత్రి.. మొత్తం 5 నెట్వర్క్ ఆసుపత్రుల్లో 14 ఫిర్యాదులు వచ్చాయని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు తెలిపారు. ఇందులో ఎక్కువ కేసులు లబ్ధిదారుని నుంచి డబ్బులు తీసుకుని వైద్యం అందించారని ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు పూర్తిగా ఉచితమన్నారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు అందించే విషయంలో లబ్ధిదారులకు ఇబ్బంది కల్గించే ఏ చర్యలైనా తప్పుగానే పరిగణిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించిన 5 నెట్వర్క్ ఆసుపత్రులకు సంబంధించి 10 కేసులకు రూ.1.54 లక్షల జరిమానా చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. మిగిలిన నాలుగు కేసులకు తగిన ఆధారాలు ఉండడంతో హెచ్చరించి కేసులను కలెక్టర్ కొట్టి వేశారు. ఈ సమావేశంలో డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, ఐఅండ్ పీఆర్ ఏడీ వేణుగోపాలరెడ్డి, డీఎం రమేశ్‌బాబు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాలపై దాడులు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 5: మండలంలోని ఎరువులు మరియు పురుగు మందుల దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం 'పుట్టగొడుగుల్లా పురుగు మందుల దుకాణాలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనితో గురువారం ఉదయాన్నే జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ ఎ.నాగేశ్వరరావు, వ్యవసాయాధికారులు, మండల వ్యవసాయాధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. వెల్లటూరు గ్రామంలో అన్ని ఎరువుల, పురుగుమందుల దుకాణాలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులు, ఇన్‌వాయిస్, ప్రిన్సిపల్ సర్టిఫికేట్, బయోఉత్పత్తులు, పురుగు మందులు అమ్మేందుకు అనుమతులు పరిశీలించారు. మానస పెస్టిసైడ్, సీడ్ షాపులో ఫారం ఓ ఇన్‌క్లూజన్ లేని కారణంగా పారాక్రాస్, అగ్రామిన్ గోల్డ్ ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.



తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

కడప(కలెక్టరే ట్), సెప్టెంబరు 5: కడప రూరల్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ సుందరేశన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శివరాం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుందరేశన్ ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్లు చేశారంటూ గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనను కమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా తిరిగి బుధవారం కడప రూరల్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చే అయ్యారు.

వినాయక మంటపాల ఏర్పాటులో

భద్రతా నియమాలు పాటించండి

- చిన్న తప్పిదం విషాదానికి దారితీస్తుంది
- జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 5: వినాయక మంటపాల ఏర్పాటులో విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, లేదంటే చిన్న తప్పిదం పెద్ద విషాదానికి దారి తీస్తుందని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి, సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ సూచించారు. వినాయక చవితి సందర్భంగా గురువారం తన కార్యాలయంలో మాట్లాడారు. పలుమార్లు సూచనలు చేస్తున్నా లక్ష్యపెట్టకుండా వినాయక మంటపాలను విద్యుత్ లైన్లకు అతి సమీపంలో వేస్తున్నారని దీని వల్ల ప్రమాదం పొంచి ఉందని అన్నారు. మంటపాలను లైన్లకు దూరంగా వేసుకోవాలన్నారు. నిర్లక్ష్యాన్ని వీడి నిండు ప్రాణాలను కాపాడాలన్నారు. విద్యుత్‌ను సరైన విధంగా వాడుకుంటే సంతోషాన్నిస్తుందని చెలగాటమాడితే ప్రాణాలు తీస్తుందన్నారు. వినాయక మంటపాలకు ఉపయోగించే విద్యుత్ వైర్లను నాణ్యమైనవిగా, అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు ఇనుప పైపుల బదులు కొయ్యలు లేదా ప్లాస్టిక్‌పైపులు ఉపయోగించుకోవాలన్నారు. డెకరేషన్ లైట్లు కట్టుకునేందుకు ఇనుప పైపులు, కడ్డీలు వాడరాదన్నారు. భారీ విగ్రహాలను ఊరేగించేటప్పుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. అవసరమైతే విద్యుత్ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు.



వెల్లుల్లి కిలో రూ.400

- ధర పెరగడంతో సరుకు బ్లాక్ మార్కెట్‌కు
- పట్టించుకోని అధికారులు
- ధరలపై కానరాని నియంత్రణ



కడప రూరల్, సెప్టెంబర్ 5: వంటల రుచి పెంచడంలో.. ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషించే వెల్లుల్లి ధర ఆకాశన్నంటుతోంది. వెల్లుల్లి సాగయ్యే మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో ఈ యేడు పంట దిగుబడులు తగ్గాయి. దీంతో అరకొరగా వస్తున్న సరుకును బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో ధరలు పెరిగిపోయాయి. ఈ కారణంగా వెల్లుల్లి హోల్‌సెల్ మార్కెట్‌లో కిలో రూ.400 నుంచి రూ.500ల వరకు విక్రయిస్తున్నారు. దాదాపు మూడు వారాలుగా వెల్లుల్లి ధరలు పెరిగిపోయాయి. దీంతో వీటిని సామాన్యులు కొనాలంటేనే ఆలోచించే పరిస్థితి వచ్చింది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. మాంసాహార వంటల్లోకి వెల్లుల్లిని విరివిగా ఉపయోగిస్తారు. ఆరోగ్య రీత్యా కూడా ఇప్పుడు పలువురు వీటిని వాడుతున్నారు. ముస్లింలైతే ప్రతి కుటుంబం నెలకు కిలోకు తగ్గకుండా వాడటం పరిపాటి. ప్రస్తుతం వీటి ధరలు అమాంతం పెరగడంతో వెల్లుల్లి వాడకాన్ని గణనీయంగా తగ్గించారు.

పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి

జిల్లా కేంద్రంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రొద్దుటూరు, రాజంపేట, జమ్మలమడుగు, రాయచోటి, బద్వేలు, యర్రగుంట్ల, పులివెందుల, వేంపల్లె, మైదుకూరు, రైల్వేకోడూరు తదితర పట్టణాలకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వెల్లుల్లి ధర సాధారణంగా కిలో రూ.100 నుంచి రూ.150 వరకు ఉన్నరోజుల్లో జిల్లాకు వందల టన్నుల సరుకు వచ్చేది. ధర పెరుగుతుందని ముందే పసిగట్టిన వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు సరుకును కొద్దిరోజుల క్రితం రూ.15,000 నుంచి రూ.20,000 వరకు కొనుగోలుచేసి నిల్వ పెట్టారు. నాసిరకం సరుకు, పచ్చి సరుకును మాత్రం విక్రయిస్తున్నారు. దీనిని కూడా కిలో రూ.400తో హోల్‌సేల్‌లో అమ్ముతున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలలో కిలో రూ.400, గ్రామాల్లో రూ.450 నుంచి రూ.500లకు పైగా విక్రయిస్తున్నారు. అధిక సరుకును బ్లాక్ చేయటంతో పాటు మరికొంత సరుకుకు మధ్యప్రదేశ్‌లోని వ్యాపారులకు అడ్వాన్స్ చెల్లించి అక్కడే నిల్వ ఉంచినట్లు తెలిసింది. అవసరాన్ని బట్టి ఇక్కడకు దిగుమతి చేసుకుంటూ ధరల పెరుగుదలకు కారణమవుతున్నారు.

ధరపై కానరాని నియంత్రణ

రోజుకో రకంగా వ్యాపారులు వెల్లుల్లి ధరను నిర్ణయిస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు సమగ్రంగా సరుకును పరిశీలించకపోవడం, నిత్యం జిల్లాకు సరుకు ఎంత వస్తుంది అనే దానిపై తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. సరుకు దిగుమతులపై దృష్టి పెట్టి ఉంటే ధరల నియంత్రణకు వీలయ్యేదని పలువురు పేర్కొంటున్నారు. వెల్లుల్లి ధరల నియంత్రణపై అటు మార్కెటింగ్‌శాఖ, ఇటు సివిల్ సప్లై శాఖలు చేతులెత్తేశాయి. వీటి ధరల నియంత్రణ మాది కాదంటే మాది కాదని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. వెల్లుల్లి ధరల పెరుగుదలపై ఆంధ్రజ్యోతి మార్కెటింగ్‌శాఖ ఏడీని వివరణ కోరగా తమ పరిధిలోకి రాదని సివిల్ సప్లై శాఖ పరిధిలోకి వస్తుందని చెప్పారు. దీంతో సివిల్ సప్లై శాఖ డీఎస్‌వోను ఫోన్ ద్వారా సంప్రదించగా వెల్లుల్లి ధరల నియంత్రణ తమకు సంబంధం లేదని మార్కెటింగ్ శాఖకు సంబంధమని చెప్పారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారే కానీ వెల్లుల్లి ధరలను అదుపుచేసే చర్యలకు మాత్రం ఉపక్రమించడంలేదు. దీంతో మార్కెట్‌లో వెల్లుల్లి ధరలు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



గంజాయి నిర్మూలనకు దాడులు పెంచాలి : ఎస్పీ

కడప (క్రైం), సెప్టెంబరు 5: జిల్లాలో గంజాయి నిర్మూలనకు విస్తృతంగా దాడులు నిర్వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. జిల్లాలో గంజాయి నిర్మూలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డీఎన్‌సీసీ (డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్) టీంతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోకి గంజాయి రాకుండా నిఘా ఉంచి కట్టడి చేయాలని ఆదేశించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీఎన్‌సీసీ టీం ఆధ్వర్యంలో జరిగిన దాడులు, నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు గత 40 రోజుల్లో 17 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేశామని 29 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ 100 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు డీఎన్‌సీసీ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యు.వెంకటకుమార్, డీఎన్‌సీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారిగా

బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు



కడప (క్రైం), సెప్టెంబరు 5: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు రీజనల్ అధికారిగా జి.శ్రీనివాసరావు కడపలోని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 1989లో ఎస్ఐగా విధుల్లో చేరారు. 2010లో సీఐగా, 2014లో డీఎస్పీగా 2023లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. గుంటూరు జిల్లా నివాసి అయిన ఈయన నెల్లూరు, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల్లో ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా అదనపు ఎస్పీగా విధులు నిర్వహించారు. విశాఖ సిటీలో ట్రాఫిక్ విభాగం అడిషనల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ కడపకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారిగా బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ శాఖ పరిధిలో ఉన్న విధుల మేరకు సమర్థవంతంగా పనిచేస్తానన్నారు.

డీసీఎంఎస్ పర్యవేక్షక అధికారిగా సత్యానందం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 5: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డీసీఎంఎస్ పర్యవేక్షక అధికారిగా వైఎస్‌సీ సత్యానందంను నియమిస్తూ జాయింట్ కలెక్టర్, డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ అదితిసింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీసరుగా పనిచేస్తున్న సత్యానందంను డీసీఎంఎస్ వ్యవహారాలను క్రమబద్ధీకరించడానికి పర్యవేక్షక అధికారిగా ప్రత్యేకంగా నియమించారు. తన రెగ్యులర్ విధులతో పాటు డీసీఎంఎస్ కార్యకలాపాలను పర్యవేక్షించాలని తెలిపారు. సొసైటీ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేందుకు తగిన మార్గనిర్దేశనం చేయాలని, డీసీఎంఎస్ ఫైళ్లను పరిశీలించాలని ఆదేశించారు. గత నెలలో డీసీఎంఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారిని నియమించారు.

19.5 టీయంసీలకు చేరిన గండికోట నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 5: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం గురువారం 19.5 టీయంసీలకు చేరినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయర్‌కు 800 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 600 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోట ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. కాగా, ప్రస్తుతం మైలవరం జలాశయానికి నీటిని నిలుపుదల చేసినట్లు డీఈ తెలిపారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల


మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలిన దృశ్యం

మైలవరం, సెప్టెంబరు 5: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతుంది. రోజుకు పెన్నాకు 500 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి గురువారం తెలిపారు. ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా గండికోట జలాశయం నుంచి ఇన్‌ఫ్లో లేదన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 5.400 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. గండికోట నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నాకు వదులుతామని.. పెన్నా పరివాహక ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈఈ తెలిపారు.

గండికి శ్రావణమాసోత్సవాల ద్వారా ఆదాయం రూ.1.60 కోట్లు

చక్రాయపేట, సెప్టెంబరు 5: గండి క్షేత్రంలో శ్రావణమాస మహోత్సవాల సందర్భంగా రూ.1,59,90,540 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. సేవ టికెట్ల ద్వారా రూ.37,96,196, లడ్డు ప్రసాదాల ద్వారా రూ.52,04,850, పులిహోర ప్రసాదం రూ.4,08,610, ప్రసాదం కవర్లు రూ.27,090, రూముల బాడుగలు రూ.1,86,300, షాపింగ్ కాంప్లెక్స్ బాడుగలు రూ.3,29,200, తాత్కాలిక షాపులు రూ.1,70,515, వివాహ కట్టడి రూ.30వేలు, తాత్కాలిక, శాశ్వత హుండీలు రూ.45,41,825, అన్నదానం విరాళం రూ.12,95,920, మనీ ఆర్డర్ రూ.34 వచ్చిందన్నారు. 05.08.2024 నుంచి 03.09.2024 వరకు శ్రావణ మాసోత్సవాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఇసుకరీచ్‌ల తనిఖీ


ఏటూరు ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 5:మండలంలోని ఏటూరు, పి.అనంతపురం, కె.వెంకటాపురం ఇసుకరీచ్‌లు, స్టాక్‌పాయింట్లను జిల్లా మైనింగ్ అధికారులు గురువారం సాయింత్రం తనిఖీ చేశారు. రీచ్‌ల వద్ద ఇసుక స్టాక్ వివరాలను ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. ఇసుక రవాణా తదితర వివరలను ఎంపీడీవో వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు స్థానిక అధికారులకు పలు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్ర, ఎంపీడీవో నాగప్రసాద్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



ముద్దనూరు సెప్టెంబరు 5: మండల పరిధి యామవరం గ్రామ సమీపంలోని పొలంలో కుందేళ్ల వేటగాడు బాలమల్లయ్య(38) విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. వివరాలిలా... మండల పరిధి పెనికెలపాడు గ్రామానికి చెందిన బాలమల్లయ్య కుందేళ్లను వేటాడేందుకు బుధవారం రాత్రి యామవరం గ్రామ సమీపంలోని పొలాల వద్దకు వెళ్లాడు. మధ్యలో దాహం వేయడంతో తాగునీటి కోసం యామవరం గ్రామానికి చెందిన నాగయ్య పొలం వద్దకు వెళ్లాడు. పొలంలోని వ్యవసాయ బోరు వద్ద నున్న స్టార్టర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వీరబల్లి, సెప్టెంబరు 5: మండల పరిధిలోని సానిపాయి సెక్షన్ వీరబల్లి బీట్‌లోని క్వారీ పాయింట్ వద్ద ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసున్నట్లు సానిపాయి ఎఫ్ఎస్‌వో రజిని తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి.. కారులో దుంగలను లోడ్ చేస్తుండగా స్వాధీనం చేసుకున్నామని.. ఇద్దరు వ్యక్తులు పారిపోయారన్నారు. వాహనాన్ని, దుంగలను రేంజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరబల్లి ఎఫ్‌బీవో అనిల్‌కుమార్, సానిపాయి ఎఫ్‌బీవో హరి, దిన్నెల ఎఫ్‌బీవో సునీర్‌బాషా, బేస్ క్యాంపు స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఒకరు అరెస్టు

కడప (క్రైం), సెప్టెంబరు 5: కడప టు మాచుపల్లె రోడ్డులోని పుష్పగిరి స్కూలు క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఇన్‌స్పెక్టర్ తేజ్‌మూర్తి, తెలిపారు. గురువారం ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సిబ్బందితో దాడి చేసి కడప శంకరాపురానికి చెందిన కాకి శివ అనే వ్యక్తిని అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి ఒక కేజీ 500 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని ఒరిస్సా రాష్ట్రం బరంపూర్ జిల్లా నుండి అక్రమంగా తీసుకువచ్చి కడపలో అమ్ముతున్నట్లు తెలిపారు.

చేపల వేటకు లైసెన్సులు తప్పనిసరి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 5: తెలుగుగంగ రిజర్వాయరులో చేపల వేటకు వెళ్లాలంటే ఖచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండాలని. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని బి.మఠం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం సీజను కాబట్టి చేపలకు వెళ్లే ప్రతి ఒక్కరూ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. చేపల వేటలో ప్రమాదవశాత్తు వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10లక్షలు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఇతర జిల్లాల నుంచి ఎవరైనా బ్రహ్మంసాగర్‌లోకి వెళ్లి చేపలు పడుతున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు చేపడతామన్నారు.

విద్యార్థులకు ఊతమిచ్చేలా.. ఫిలాటలీ స్కాలర్‌షిప్

- తపాలా బిల్లల సేకరణ అభిరుచిని ప్రోత్సహించడమే లక్ష్యం
- ఫిలాటలీ క్విజ్‌లో ఎంపికైన వారికి స్కాలర్‌షిప్
- నోటిఫికేషన్ విడుదల చేసిన తపాలాశాఖ
- ఈనెల 16 వరకు దరఖాస్తులకు గడువు

కడప (మారుతీనగర్), సెప్టెంబర్ 5: తోకలేని పిట్ట తొంభై ఆమడ చేరిందనే సామెతలా తపాలాశాఖ ద్వారా ప్రజలు రాసిన ఒక కార్డు ముక్క నాడు దేశంతో పాటు విదేశాలకు సైతం చేరిన సంగతి తెలిసిందే. కాలగమనంలో వచ్చిన, వస్తున్న మార్పులకు అనుగుణంగా తపాలాశాఖ కూడా తన పరిధిని మార్పుచేసుకుంటూ బ్యాంకులకు ధీటుగా ప్రజలకు, ఖాతాదారులకు సేవలందిస్తుంది. ఈ క్రమంలో విద్యలో రాణిస్తున్న పాఠశాల స్థాయి విద్యార్థులకు ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి దీన్ దయాళ్ స్పర్శ యోజన ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టింది. స్టాంపుల సేకరణ అభిరుచి పిల్లలకు విద్యాపరంగా చాలా ప్రయోజనాలు కలిగిస్తుంది. ప్రధానంగా స్టాంపు జారీ చేసిన కాలం, జారీకావడానికి గల ఇతివృత్తం నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి బోధిస్తుంది. ఏదిఏమైనా స్టాంపుల సేకరణ అభిరుచి స్వారూప్య ఆసక్తులతో పాటు పిల్లల మధ్య కొత్త స్నేహాలకు దారితీస్తుంది. సమాచారాన్ని సేకరించే ప్రక్రియలో పిల్లల మెదడు మరింత చురుగ్గా పని చేసి.. వారిలో జ్ఞాపకశక్తి మెరుగుపడగలదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా తపాలా బిల్లల సేకరణ అభిరుచిని విద్యార్థుల్లో కల్పించడమే ఏకైక లక్ష్యంగా తపాలాశాఖ ద్వారా ఫిలాటలీ పథకాన్ని ప్రవేశపెట్టింది.

విద్యలో రాణిస్తూనే...

ప్రతి యేటా విద్యలో మంచి ప్రతిభ కనబరస్తూనే స్టాంపుల సేకరణ (ఫిలాటలీ)ను అభిరుచిగా కొనసాగించే జిల్లాకు చెందిన 6, 7, 8, 9, తరగుతుల విద్యార్థులకు సర్కిల్ స్థాయిలో ఫిలాటలీ ప్రాజెక్ట్, ఫిలాటలీ క్విజ్ పరీక్ష


కడప ప్రధాన తపాలా కార్యాలయం

చేపట్టనున్నారు. పరీక్ష ఆధారంగా స్కాలర్‌షిఫ్‌లను తపాలాశాఖ అందజేస్తుంది. కాగా క్విజ్‌కు (పరీక్ష) దరఖాస్తు చేసుకునే విద్యార్థి 6,7,8,9, తరగతులను గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ వుండాల్సి వుంది. విద్యార్థి చదివే పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ ఏర్పాటై వుండాలి. అందులో ఆయా విద్యార్థినీ, విద్యార్థులు సభ్యులుగా వుండాల్సి వుంది. ఒకవేళ వారి పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ లేకపోతే విద్యార్థులు వారి వ్యక్తిగత ఫిలాటలీ డిపాజిట్ కాతా కలిగి వుండాలి. ఇదిలా వుండగా 2023-24 విద్యా సంవత్సరానికి పాఠశాలలో జరిగిన చివరి పరీక్షలో కనీసం 60శాతం మార్కులు, లేదా తత్సమాన గ్రేడ్ పాయింట్స్‌ను విద్యార్థులు సాధించాల్సి వుంది. ఇందుకనుగుణంగా పాఠశాలల నుంచి సంబంధిత ప్రోగ్రెస్ రిపోర్ట్, మార్కుల జాబితా, సర్టిఫికెట్ కాపీలు దరఖాస్తుతో పాటు జతచేయాల్సివుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ విద్యార్థినీ విద్యార్థులకు 5శాతం సడలింపు కలదు.

ఎంపిక ప్రక్రియ ఇలా...

ఎంపిక ప్రక్రియ రెండు అంచెలుగా జరుగనుంది. ఫిలాటలీ రాతపూర్వక క్విజ్ ఈనెల 30న కడప ప్రధాన తపాలా కార్యాలయంలో జరుగనుంది. క్విజ్‌లో ఎంపికైన విద్యార్థులు రాత పరీక్ష ఫలితాల ప్రకటన తర్వాత 15 రోజుల్లో తుది ఎంపిక కోసం ఫిలాటలీ ప్రాజెక్టును సమర్పించాల్సి వుంటుంది. ఫిలాటలీ రాత పూర్వక క్విజ్‌లో మొత్తం 50 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో కరెంట్ అఫైర్స్ (5), హిస్టరీ (5), సైన్స్ (5), స్పోర్ట్స్, కల్చరల్, పర్సనాలిటీస్ (5), జియోగ్రఫీ (5) లోకల్‌ఫిలాటలీ (10), నేషనల్ ఫిలాటలీ (15) మార్కులుంటాయి. ఫిలాటలీ ప్రాజెక్టులో ప్రాజెక్టుకు 4 నుంచి 5 పేజీలు మించరాదు. ప్రాజెక్టులో 16 స్టాంప్స్‌తో పాటు 500 పదాలకు మించకుండా చేయాల్సి వుంది.

స్కాలర్‌షిప్ తీరు ఇలా...

ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6,000 అందజేయనున్నారు. గెలుపొందిన నగదును విద్యార్థి, తాలూకు తల్లిదండ్రుల ఉమ్మడి (ఐపిపిబి-పోస్టల్) ఖాతాలో జమచేస్తారు. జిల్లాలోని ఔత్సాహిక విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా ఈనెల 16లోగా తమ దరఖాస్తులను బోనఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు దరఖాస్తు ఫారమ్‌ను స్పీడ్ పోస్ట్ ద్వారా ఫిలాటలీ స్టాంపులు అతికించి పంపించాల్సి వుంది.

పంపాల్సిన చిరునామా

దరఖాస్తులు ది పోస్ట్‌మాస్టర్ జనరల్, కర్నూలు రీజియన్, కర్నూలు-518002 అనే చిరునామాకు ఈనెల 16లోగా పంపాలి. కొరియర్ ద్వారా పంపిన దరఖాస్తులు అంగీకరించబడవు.

సద్వినియోగం చేసుకోవాలి



తపాలాశాఖ ద్వారా అందివచ్చిన అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకానికి ఎంపికై లబ్ధిపొందాలని కడప పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి.రాజేష్ ఆకాంక్షించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటన

- మెడికల్ క్యాంపులు
- బాధితులకు దుస్తులు, ఆహారం పంపిణీ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 5: వరద బాధితులకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, శిబిరాలు ఏర్పాటు చేసి వృద్ధులు, గర్భిణులకు మూడు పూటల ఆహారం, అవసరమైన మందులు అందిస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండోరోజు గురువారం విజయవాడలోని తూర్పుకృష్ణలంక 17వ వార్డులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డిలు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ వైద్య శిబిరం ద్వారా అందుబాటులో ఉన్న 67 రకాల మందులు, ఒక డాక్టర్, ఇరువురు హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు, సచివాలయం సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. 17వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మంత్రి స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య పనుల పట్ల అధికారులకు సూచనలు చేశారు. మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో బాధితులకు మంత్రి దుస్తులు పంపిణీ చేశారు. ఆ కాలనీలో ఉన్న కుటుంబాలు పూర్తి స్థాయిలో వరదకు ప్రభావితం అయ్యాయని వారందరికీ ప్రభుత్వ పరంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందిస్తూ సహాయక చర్యలు క్షేత్రస్థాయిలో అందేలా చేస్తున్నామని అధికారులు తెలిపారు.


విజయవాడలోని తూర్పులంక 17వ వార్డులో వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సహాయక చర్యల్లో మంత్రి బృందం: వరద బాధితులకు సహాయం అందించే విషయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి (రాముడు టీమ్) టీమ్ సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటూ ఎక్కడికక్కడ ఆపదలో ఉన్న వారికి ఆహార పొట్లాలు అందిస్తున్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో అవసరమైన వారికి ఆహార పొట్లాలు పరిశుభ్రంగా ప్యాకింగ్ చేసి ఆకలితో ఉన్న వారికి త్వరితగతిన వాహనాల ద్వారా అందజేస్తున్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ


పవిత్రోత్సవాలను తీసుకొస్తున్న టీటీడీ అర్చకులు, సిబ్బంది

ఒంటిమిట్ట, సెప్టెంబరు 5: ఏకశిలానగరిలోని కోదండరామాలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం టీటీడీ ఆలయ అధికారుల ఆధ్వర్యంలో రఘురాముడికి ఉత్సవ నిర్వాహకులు వీణా మనోజ్‌కుమార్‌చార్యులు పవిత్రమాలలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. సీతారామలక్ష్మణమూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, ద్వారతోరణ, కుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, పవిత్ర దేవతాహోమం, పంచసూక్త పరివార హరణం, పవిత్ర సమర్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రామయ్యను దర్శించుకున్నారు. తిరిగి శుక్రవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఆదేరోజు సాయంత్రం 5గంటల నుంచి స్వామివారి ప్రాకారోత్సవం ఉంటుంది.

డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా 'ఆకుపచ్చముగ్గు'


రచయిత వేంపల్లె షరీఫ్

వేంపల్లె, సెప్టెంబరు 5: డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ రాసిన 'ఆకుపచ్చ ముగ్గు' కథను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఏడాది నుంచి సామాజిక శాస్త్రాలు చదువుతున్న డిగ్రీ విద్యార్థుల్లో యునెస్కో ప్రతిపాదించిన శాంతి మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేకంగా ఒక పేపర్‌ను 50మార్కుల కోసం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందించేందుకు వీలుగా ఉన్న వేంపల్లె షరీఫ్ రాసిన కథ ఆకుపచ్చ ముగ్గును ఎంపిక చేశారు. ఇంటి ముందు ముగ్గులేసే ఒక ముస్లిం ఆడపిల్ల తర్వాత ఆ పని మానేసి అరచేతుల్లో గోరింటాకుతో ముగ్గు వేస్తుంటుంది. ఒక మతానికి మరో మతానికి అంతే తేడా, దీని కోసం ఎవరు బేషజాలకు పోవాల్సిన పని లేదని సూచించే ఈ కథను గొప్ప సామరస్య రచనగా పాఠ్యాంశ రూపకర్తలు పేర్కొనడం జరిగింది. రావిశాస్త్రి వంటి గొప్ప కథలతో పాటు తన కథను ఎంపిక చేసినందుకు రచయిత వేంపల్లె షరీఫ్ ఈ సందర్భంగా పాఠ్యాంశ రూపకర్తల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆర్డీఓ

సింహాద్రిపురం, సెప్టెంబరు 5: సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్ పరిశీలించారు. ఈనెల 3వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో మరమ్మతులు చేయించండి... మహాప్రభో అనే వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జిల్లా అధికారులు ఆర్డీఓను పాఠశాలను పరిశీలించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిసింది. ఈమేరకు ఆర్డీఓ పాఠశాల దుస్థితిని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణాలకు మరమ్మత్తులు చేయించాలా.. నూతన భవనంలోకి మార్పు చేయించాలా అని ఉపాధ్యాయులను అడిగారు. దీంతో ఉపాధ్యాయులు నూతన భవనంలోకి పాఠశాలను మార్చాలని ఆర్డీఓకు తెలిపారు. దీంతో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాన్ని ఆర్డీవో పరిశీలించారు. వెంటనే భవన నిర్మాణానికి సంబంధించిన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి.. చిన్నపాటి పనులను పూర్తి చేసి, 15 రోజుల్లో పాఠశాల భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉండేలా చూడాలని


సింహాద్రిపురంలో ప్రధానోపాధ్యాయురాలితో పాఠశాల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ వెంకటేశ్

ఆదేశించారు. 20 రోజులలో నూతన భవనంలోకి చేరేలా చూస్తానని ఆర్డీఓ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ గుర్రప్ప, ఆర్ఐ సుజిత్, వీఆర్వో పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుండా బిల్లులు.. నిధుల దుర్వినియోగం

- కలెక్టర్ ఆదేశాల మేరకు సీఈవో విచారణ

సుండుపల్లి, సెప్టెంబరు 5: పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేశారని.. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు సుండుపల్లి మండలానికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు విచారణ అధికారిగా వచ్చిన అన్నమయ్య జిల్లా సీఈఓ జీవీ రమణారెడ్డి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహిస్తుండగా కొంతమంది ప్రజా సంఘాల నాయకులు, జనసేన నాయకులు గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు, అధికారులు కలసి లక్షల్లో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీసీ రోడ్లు, మట్టి రోడ్లు వేయకుండానే నిదులు డ్రా చేశారని తెలిపారు. అంతే కాకుండా బోర్లు వేయకుండా, పైపు లైన్ ఏర్పాటు చేయకుండా చేసినట్లు


ఎంపీడీవో కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న సీఈఓ జి.వి రమణారెడ్డి

బిల్లులు చేసుకున్నారని, మూడు, నాలుగు గ్రామాల్లో పెద్ద మొత్తంలో పనులు చేయకుండానే బిల్లులు చే శారని జనసేన నాయకులు ఆరోపించారు. ఈమేరకు బిల్లులు పెట్టిన యం.బుక్కులు, ఇతర రికార్డులను విచారణ అధికారులు పరిశీలించారు. అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టరుకు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ రామచంద్ర, సూపరింటెండెంట్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాల మహానాడు రాష్ట్ర నాయకులు బండి ఈశ్వర్, ఏఐవైఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జనసేన నాయకురాలు సుగుణమ్మ, రామా శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. నిధులు దుర్వినియోగం అయ్యాయని, కూట మి ప్రభుత్వం విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన లక్షలాది రూపాయలు పక్కదారి పట్టడం బాధాకరమన్నారు.

8 ఏళ్ల తరువాత.. ఎర్రచెరువులో జలకళ

- ఎమ్మెల్యే పుట్టా చొరవ...శాశ్వత జీఓతో నిండుతున్న చెరువులు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 5: మైదుకూరు నియోజకవర్గంలో ఎస్ఆర్-1 నుంచి చెరువులను నింపేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ 2015లో శాశ్వత జీవోను తీసుకొచ్చారు. జీవో పుణ్యమా అని ఎనిమిది ఏళ్ల తరువాత గురువారం ఎర్రచెరువులో నీరు చేరి అలుగుపారుతోంది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో నీటి సమస్య వస్తుందని.. అప్రమత్తమైన ఎమ్మెల్యే ఎస్ఆర్-1 నుంచి కాల్వగట్ల వెంబడి అధికారులను పరిగెత్తించి పనిచేయించారు. కాలువల్లోని కంప,చెత్త చెదరాలు లేకుండా చేసి. ఎక్కడ నీరు వృధా కాకుండా చెరువులకు నీటిని అందించారు. మొదట ఎర్రచెరువు నింపారు. శాశ్వత జీవో ద్వారా చెరువులకు నీటిని నింపడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




సొంతింటి కల నెరవేరేనా..!

● గుడారాల్లో నివాసం.. విషపురుగులతో సహవాసం ● బుడుబుక్కుల వారి ఆవేదన

వేంపల్లె, సెప్టెంబరు 5: వారిది కటిక పేదరికం. ఉండేందుకు ఇల్లు ఉండదు. జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేదు. ఊరూరు తిరుగుతూ చిల్లర వస్తువులు అమ్ముతూ జీవనం సాగిస్తుంటారు. బుడుబుక్కుల వారు ఈ పేదరికాన్ని అనుభవిస్తున్నారు. పూర్వం ప్రతి ఊరులో కొన్ని రోజులు ఉంటూ జీవనం సాగిస్తుండేవారు. 30 ఏళ్ల క్రితం అనంతపురం ప్రాంతం నుంచి వేంపల్లెకు వచ్చిన పలు కుటుంబాలు ఇక్కడే ఉంటున్నాయి. వారంతా గుడారాల్లో ఉంటూ జీవనంసాగిం చేవారు. వైఎస్ హయాంలో రాజీవ్‌కాలనీలో ఇళ్లు ఇచ్చినప్పటికి కొందరు అక్కడ చేరిపోగా మరికొందరు ఆర్థిక పరిస్థితి బాగలేక వచ్చిన ఇంటిని అమ్ముకొని ప్రస్తుతం గుడారాల్లోనే నివాసం ఉంటున్నారు. కొండప్రాంతానికి సమీపంలో వంక గడ్డన కంపచెట్ల మధ్య విషపురుగుల సహవాసంతో గుడారాల్లో నివాసముంటున్న ఈ బుడుబుక్కుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకొంటున్నారు.

గుడారాల్లో నివాసం

వేంపల్లె రాజీవ్‌కాలనీ వెనుకవైపున, జగనన్నకాలనీ కొండప్రాంతం ఉంది. వంక సమీపంలో బుడుబుక్కులకు సంబంధించిన పలు కుటుంబాలు గుడారాల్లో నివాసముంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా వేంపల్లెలో ఉంటున్న వీరికి రేషన్‌కార్డులు ఉన్నాయి. పిల్లలను పాఠశాలలకు పంపడం ఒక మంచి పరిణామం. అయితే ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాజీవ్‌కాలనీలో వారికి ఇళ్లు కేటాయించారు. అందులో కొందరు నివాసముంటుండగా మిగిలిన 15 కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఇళ్లను అమ్ముకొని గుడారాల్లో నివాసముంటున్నారు. కొందరికి ఇళ్లు మంజూరు కాలేదు. వెంట్రుకలు, పక్కపిన్నులు, బొట్టుబిల్లలు ఇతర వస్తువులు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.



వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలోని కొండప్రాంతంలో నివాసముంటున్న బుడుబుక్కుల వారు... వంకగడ్డ కంపచెట్ల మధ్య ఉన్న గుడారాలు

ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేదు

ప్రస్తుతం గుడారాల్లో ఉంటున్న ఆ కుటుంబాల వద్ద విషపురుగులు తిరుగుతుంటాయి. పిల్లలు, పెద్దలు భయంభయంగా జీవనం సాగిస్తున్నారు. కొందరికి రేషన్‌కార్డులు ఉన్నా ఇళ్లు మంజూరు కాలేదు. కొందరికి జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరైనప్పటికి పూర్తిచేసుకొని అక్కడకు వెళ్లేందుకు ఆర్థిక స్థోమతలేక గుడారాల్లో ఉంటున్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో ఇల్లు కట్టుకునేందుకు చేయూతనివ్వాలని, ఉపాధికి సహకారం అందించాలని కోరుతున్నారు.

గోడల వరకు కట్టుకున్నా..


జగనన్న కాలనీలో ఇల్లు వచ్చింది. గోడల వరకు కట్టుకున్నా. బిల్లులు రాలేదు. ఆ డబ్బుతో ఇళ్లు పూర్తికాదు. నాకు ఆర్థిక పరిస్థితి బాగలేదు. ప్రభుత్వమే పూర్తిగా కట్టించి ఇవ్వాలి.

- గంగమ్మ, గుడార నివాసి, వేంపల్లె

విషపురుగులతో భయంభయంగా..


మాకు ఇల్లు లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. విషపురుగుల మధ్యనే పిల్లలతో కలిసి నివాసముంటున్నాం. ఇళ్లు మంజూరు చేసి ఉపాధికి చేయూతనందించాలి.

- పుల్లయ్య, గుడార నివాసి, వేంపల్లె

బోగస్ పెన్షన్లపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 5 : బోగస్ పెన్షన్ తీసుకుంటున్న వారిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆదేశించారు. కమలాపురం మండలంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై 2023-24 సంవత్సరంలో నిర్వహించిన 1993 పనులకు సోషల్ ఆడిట్‌లో గుర్తించిన అవకతవకలపై గురువారంస్థానిక ఉపాధిహామీ కార్యాలయం వద్ద ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంబటూరులో బోగస్ పింఛన్లపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ భారతి, ఎంపీడీవో జ్యోతి, ఏపీవో పార్థసారథి, గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు నాగరత్నమ్మ, జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగేశ్వర్‌రెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో, క్వాలిటీ కంట్రోల్ అధికారి మధు, ఎస్ఆర్‌పీ భాస్కర్ ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిధికి రూ.25 వేల విరాళం


చెక్కును అందజేస్తున్న అనంతరామయ్య

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 5: రాష్ట్రంలో తుఫాను వరద బాధితుల సహాయార్థం మాదవరానికి చెందిన ఎంవీఎస్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ ఎం.అనంత రామయ్య రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం కలెక్టర్ శివ శంకర్‌కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వ సాయంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. హ్యాండ్ లూమ్స్ ఏడీ నాగరాజరావు, చేనేత సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లె ఎంపీడీఓగా రమణారెడ్డి



వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 5: వీఎన్‌పల్లె ఎంపీడీఓగా రమణారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి కలసపాడుకు బదిలీ కాగా మైదుకూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న రమణారెడ్డి ఇక్కడకు వచ్చారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 5 : జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్, రవి డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలోవారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు సరైన మౌళిక వసతులు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఎల్ఐసీ కీలకపాత్ర

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 5: వ్యాపారరంగంతో పాటుగా సేవారంగంలో అలాగే దేశ నిర్మాణంలో ఎల్ఐసి పాత్ర చాలా కీలకపాత్ర పోషిస్తోందని ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కే.ఆర్.వి. రవికుమార్ అన్నారు. బీమా వారోత్సవాలను పురస్కరించుకుని ఎల్ఐసి ఆధ్వర్యంలో ఆరవరోజైన గురువారం స్థానిక నాగరాజుపేట ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీసు నుంచి నగర పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు, సేల్స్ మేనేజర్ సాల్మన్‌రాజు, కడప శాఖాధిపతులు శ్రీనాథ్‌రెడ్డి, వెంకటకృష్ణ, సంఘాల ప్రతినిధులు నిత్యానందరెడ్డి, చంద్రపాల్, సంజయ్, రఘునాథరెడ్డి, అవధానం శ్రీనివాస్, సుధీకర్, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్, హబీబుల్లాఖాన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

వేముల, సెప్టెంబరు 5: ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో పత్తి పంట పొలాలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సందర్శించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వనరులకేంద్రం వ్యవసాయాధికారి నాగభూషణ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి, ఎంపీఈఓ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకుడు..ఉపాధ్యాయుడు

● విద్యార్థులు తమ గురువు బోధనలు ఎన్నటికీ మరువరాదు ● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గురుకుల్ విద్యాపీఠ్‌లో....

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 5 : మార్గదర్శకుడు ఉపాధ్యాయుడు అని వక్తలు పేర్కొన్నారు. కడప నగరం గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూలులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాల వసి నివాళులర్పించారు. జాతీయ స్థాయిలో ప్రఖ్యాత చెందిన నాయకులను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు తమ గురువులను పూజించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎ.వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టరు ఎ.వీరకుమారి, ఏవీఆర్ సీఈవో ఎఎల్ వివేకానంద, ప్రిన్సిపాల్ ఎంఎన్ మునిచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ నరసింహ పాల్గొన్నారు.

శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో...

కడప నగరం ఉక్కాయపల్లె శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులందరూ క్రమశిక్షణ యుతమైన జీవన విధానాలను అవలంబించడం విలువలతో కూడిన విద్య విధానం వల్ల దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా తయారు కావాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు విద్యార్థులకు బహుమతులు అందించారు.

నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూలులో...

కడప నగరం నాగార్జున హైస్కూలులో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహంచారు. ప్రధానోపాధ్యాయులు క్రిష్టారెడ్డి సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికిపూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సర్వేపల్లి చేసిన సేవలను వివరించారు. దేశం తలరాతలను రాసిన దేశభవిష్యత్తునిర్దేశించేది తరగతిగదిలోని ఉపాధ్యాయుడేనన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులివెందులలో...ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించి ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల అభివృద్ధికి, సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. డాక్టర్ బాలనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ శ్రీనిత మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటరు శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ సుగుణ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రాధిక, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కడప పెన్షనర్ల సంఘ కార్యాలయంలో...

కడప (కలెక్టరేట్), సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలవేసి ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు నివాళులర్పించారు అనంతరం సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బరాయుడిని సన్మానించారు. శంకరయ్య, బాలయల్లారెడ్డి, నగేష్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కడప నగరం 17వ వార్డులో...నగర కార్పొరేషన్ పరిధిలోని 17వ వార్డు పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి జన్మ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయని నిర్మలాజ్యోతి పూల మాలవేసి నివాళులర్పించారు. విజయ, రెడ్డిలక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

వల్లూరులో... మండల కేంద్రమైన వల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లిరాధాక్రిష్ణ జయంతి పురస్కరించుకుని గురుపూజోత్సవం స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించారు.


నాగార్జున హైస్కూల్‌లో రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం క్రిష్టారెడ్డి

సీకేదిన్నెలో... చింతకొమ్మదిన్నె మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. బయనపల్లె వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దీనదయాల్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టల్ డిపార్టుమెంట్ సూపరింటెండెంట్ రాజేష్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఘనంగా సత్కరించారు.

సింహాద్రిపురంలో... కోవరంగుట్టపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందజేత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 5: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎస్.అబ్దుల్ లతీఫ్ అవార్డు అందుకున్నారు. గురువారం కడపలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, కలెక్టర్ శివశంకర్, డీఈఓ అనురాధ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ప్రశంసాపత్రం, మెమెంటో అందించి సత్కరించారు.


శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో బహుమతులు అందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు


గురుకుల్ విద్యాపీఠ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



రిటైర్డ్ హెడ్మాస్టరును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సాయిబాబా పాఠశాలలో...

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 5 : కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాక్రిష్ణ ఒక ఉపాధ్యాయుడుగా ఉంటూ దేశంలోనే అత్యున్నత స్థానమైన రాష్ట్రపతిగా ఎన్నిక కావడం సంతోసకరమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నవతరానికి తగ్గట్లుగా విలువలతోకూడిన విద్య సాంకేతికపరంగా అందించాలని కోరారు. అనంతరం కార్పొరేటరు ఎంవీ శ్రీదేవి మాట్లాడారు.

గణేశ్ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ

కడప (క్రైం), సెప్టెంబరు 5 :కడప నగరంలో వినాయక నిమజ్జనం చేసే పాత కడప చెరువు ప్రాంతాలను గురువారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు సిబ్బందితో పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. నిమజ్జనం సందర్భంగా విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్‌లను దానికి సంబంధించిన డ్రైవర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టరు వెంకటకుమార్, టూటౌన్ సీఐ నాగార్జున, తాలుకా సీఐ వెంకటేశ్వర్లు, సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్, ఒంటిమిట్ట సీఐ క్రిష్ణంరాజు నాయక్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 5:వినాయక చవితి పండుగ సందర్భంగా ఎవరైన శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అటువంటి వారిపైకఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. సవాస్యంపల్లె గ్రామంలో గురువారం గ్రామస్థులను పిలిపించి వినాయకచవితి పండుగను సంతోషాలతో ఆనందోత్సవంగా జరుపుకోవాలన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 5: ప్రతి ఒక్కరూ సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలని ఉప సంచాలకులు పేర్కొన్నారు. కడప నగరం సెంట్రల్ జైలులో 58వ అంతర్జాతీయ అక్షరాసత్య వారోత్సవాల్లో భాగంగా వయోజన విద్య ఆధ్వర్యంలో అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య ఉపసంచాలకులు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని చదువు ద్వారానే ఏదైనాసాధించగలమన్నారు. రాయలసీమ రీజియన్ డీఐజీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ జైలులో కూడా ఈ కార్యక్రమం ద్వారా ఖైదలందరూ సంపూర్ణ అక్షరాస్యులుగా ఎదగాలని దానికి మా సహకారం ఉంటుందన్నారు. నిరక్షరాస్య ఖైదీలకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో డీఎస్‌జేలు జవహర్‌బాబు, రమేశ్, వయోజన విద్య సూపర్‌వైజర్లు సోమశేఖ రొరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు.

వికలాంగులకు గృహోపకరణాలు వితరణ

పులివెందుల టౌన్, సెప్టెంబరు 5 : వైద్యనిపుణుడు పురుషోత్తంరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కుమారుడు విలియం సత్యానందరెడ్డి సమకూర్చిన గృహోపకరణాలను స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కార్యాలయంలో వికలాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాదరెడ్డి, మార్కెట్‌యార్డు కమిటి మాజీ చైర్మన్ గోటూరుచిన్నప్ప, బ్రదర్ రఘుకర్, రాజారెడ్డి ఆసుపత్రి సహాయకులు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో కడప 'జనసేన' సేవలు


దుస్తులు అందిస్తున్న సుంకర శ్రీనివాస్

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 5 : ఉమ్మడి కడపజిల్లా కోఆర్డినేటర్ కడప నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ సుంకర శ్రీనివాస్ వరద బాధితులకు అండగా నిలుస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొత్తపాలెం గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టారు. అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిధిలో సుంకర శ్రీనివాస్ వరద బాధితులకు దుప్పట్లు, చీరలు పంచలు తదితరాలు పంపిణీ చేశారు.అనంతరం ఆహారం అందించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బోరెడ్డి నాగేంద్ర, సీనియర్ నాయకులు మాలే శివ, రమణ పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయం కోసం టీడీపీ విరాళాల సేకరణ

వేంపల్లె, సెప్టెంబరు 5: కనీవిని ఎరుగని విధంగా విజయవాడలో వరదలు ముంచుకొచ్చి ఇబ్బందులు పడుతున్న బాధితుల కోసం టీడీపీనాయకులు విరాళాలు సేకరిస్తున్నారు. టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, రజనికాంత్‌రెడ్డి, పివి రమణ, మండల ఉపాధ్యక్షులు వీరభద్ర ఆధ్వర్యంలో గురువారం వేంపల్లె ప్రధాన వీధుల్లో ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. నల్లగారి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు శ్రీరామిరెడ్డి, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అల్లాబకాష్, మహమ్మద్, నామా వేమ, భాస్కర్, ఉరుటూరు నాగభూషణం, రమణ, గిడ్డంగివారిపల్లె సుధాకర్‌రెడ్డి, కుమ్మరాంపల్లె భాస్కర్‌రెడ్డి, ఎస్సీనాయకులు యుగంధర్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో పారిశుధ్య సిబ్బంది

విజయవాడలో వరదలతో అతలాకుతలమైన ప్రాంతాలను శుభ్రపరిచి సాధారణ పరిస్థితికి తెచ్చేందుకు తమవంతుగా వేంపల్లె పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచు ఆర్.శ్రీను, ఈఓ సుబబ్బారెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ కార్యదర్శి రాఘవేంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ప్రకాశం, గంగన్న, శ్రీనివాసులు, బాబు, నాగరాజు తదితర పారిశుధ్య సిబ్బంది సితార సర్కిల్, లేబర్ కాలనీ, 44వ డివిజన్ తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులు నిర్వహజంచారు.

మార్గదర్శిని... మరియతల్లి


మరియతల్లి సేవలో ఫాదర్లు

కడప (కల్చరల్), సెప్టెంబరు 5: మార్గదర్శిని మరియ తల్లి అని ముద్దనూ రు విచారణ గురువులు ఫాదర్ మర్రెడ్డి, పాలూరు విచారణ గురువులు ఫాదర్ ప్రకాష్ కొనియాడారు. కడప రైల్వేస్టేషన్ సమీప ఆ రోగ్యమాత పుణ్యక్షేత్రం ఉత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యే క ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమాత పర్యవేక్షణ లేకపోతే పిల్లలు చేరవలసిన పవిత్ర గమ్యానికి చేరుకోలేరన్నారు. సాతాను వారిని ఆవరిస్తుందన్నారు. సాతానును జయించడానికి, మోక్షం చేరడానికి మరియతల్లి మార్గదర్శకమన్నారు.

తల్లిదండ్రుల తర్వాత గురువే

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ● డాక్టర్ సర్వేపల్లిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి
ఉపాధ్యాయులు సమాజమార్గదర్శకులు ● మానవత ఆధ్వర్యంలో భారీగా ఉపాధ్యాయులకు సన్మానం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 5: తల్లిదండ్రుల తర్వాత గురువులకే అగ్రపీఠమని, భావితరాలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేది గురువులేనని వక్తలు వ్యాఖ్యానించారు. ఎర్రగుంట్ల మానవత యూనిట్ ఉపాధ్యాయులను సన్మానించింది. డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి పురస్కరించుకుని విశ్రాంత డిప్యూటీ డీఈఓ బి.మునిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, భారతి, సాంబశివుడును సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, మానవత చైర్మన్ డి.రఘురామిరెడ్డి, ప్రతినిధులు మల్లికార్జునరెడ్డి, రంగయ్య, సతీష్‌కుమార్, గంగాధర్‌రెడ్డి, ఎస్వీరమణారెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, సుబ్బరాయుడు, రామ్మోహన్, శ్రీరాములు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన గురువులతో మానవత టీం

రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో...

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 5: స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాలను నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కరస్పాండెంట్ తరుణ్ ఇంద్రశేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో....

ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అశోక్ పేర్కొన్నారు. స్టేట్‌బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యాయులను సత్కరించారు. ఏపీటీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట జనార్ధన్‌రెడ్డి, భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు బాలజోజప్ప, జహీర్ అబ్బాస్, చాంద్‌బాష, అల్లాబకాష్, చంద్రశేఖర్, పరమేశ్వర్, రెడ్డికిశోర్, హరిప్రసాద్, అరిగెల భాస్కర్, ఒంటెద్దు సుధాకర్‌రెడ్డి, షాబుద్దీన్, బీరభద్రుడు, లతను సన్మానించారు. బ్యాంకు ఉద్యోగులు మహేష్, శ్రీకాంత్, సాగర్, నగ్మ, శివప్రసాద్, సమంత, జయలక్ష్మి పాల్గొన్నారు.

ముద్దనూరులో....

ముద్దనూరు సెప్టెంబరు5: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం చేసుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజబాబు ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాబు, పీడీ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐడీపీఎస్‌లో...

చాపాడు, సెప్టెంబరు 5: ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూలులో టీచర్స్‌డే నిర్వహించారు. అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. చైర్మన్ జయచంద్రారెడ్డి, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర మాట్లాడారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ...

జమ్మలమడుగు, సెప్టెంబరు 5: టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం చేసుకున్నారు. స్థానిక జడ్పీ హైస్కూలులో హెడ్మాస్టర్ భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం, సెప్టెంబరు 5: ఉపాధ్యాయులు సమాజ దార్శనికులు అని ఎంపీడీఓ శంషాద్ భాను, మాజీ ఎంపీపీ అల్లె ప్రభావతి అన్నారు. మైలవరంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని అల్లె ప్రభానాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంఈఓలు రమణారెడ్డి, చిట్టిబాబును సన్మానించారు. విశ్రాంత ఎంఈఓలు వెంకటేశ్వర్లు, క్రిష్టఫర్, హెచ్ఎంలు ప్రభాకర్‌రెడ్డి, కొండారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది మురళి పాల్గొన్నారు.

బద్వేలులో....

బద్వేలుటౌన్, సెప్టెంబర్ 5: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రత్నం స్కూల్లో సర్వేపల్లె రాధాక్రిష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో యోగాటీచర్ బీఎస్ నారాయణరెడ్డిని రత్నం స్కూలు కరెస్పాండెంట్ రత్నం, సుబ్బయ్య, ప్రసాద్, శిరీషశ్రీధర్, మల్లికార్జున, ఆంజనేయులు సత్కరించారు.

చెన్నకేశంపల్లె పాఠశాలలో...

బద్వేలు/బద్వేలు రూరల్, సెప్టెంబరు 5: చిన్నకేశంపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య, స్టాఫ్ సెక్రటరీ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు టి.వి.సుబ్బారావు, సుబ్బరాయుడు, వరలక్ష్మి, గౌస్‌బాష, రామమోహన్, ఇందిర, నరేష్ పాల్గొన్నారు.

గురువులే ప్రత్యక్ష దైవాలు



ఉపాధ్యాయులను సన్మానించిన వైష్ణవి స్కూలు అధినేత రామక్రిష్ణ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 5: గురువులే ప్రత్యక్ష దైవాలని డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా వైష్ణవి స్కూలులో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, రామసుబ్బారావు పోలిరెడ్డి రామచంద్రారెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గురువులు తల్లిదండ్రుల కన్నా గొప్పవారన్నారు. పేదకుటుంబంలో పుట్టి భారతరాష్ట్రపతిగా మనదేశానికి సేవలందించిన సర్వేపల్లి రాధాక్రిష్ణన్ మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో వైష్ణవి స్కూలు అధినేత రామక్రిష్ణ, ఎస్టీయూ నేత పుల్లయ్య పాల్గొన్నారు. మండలంలో గురుపూజోత్సవం పురస్కరించుకుని ఏపీటీఎఫ్ కార్యాలయంలో రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామేశ్వరంలో ప్రధానోపాధ్యాయులు రామక్రిష్టారెడ్డిని సన్మానించారు.

వ్యక్తిగత శుభ్రత చాలా ముఖ్యం : డీఎంహెచ్ఓ

ఖాజీపేట, సెప్టెంబరు 5: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరిచేరవని డీఎంహెచ్ఓ నాగరాజు అన్నారు. గురువారం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2018లో పోషన్ అభియాన్, జన్ ఆందోళన, గ్రోత్ మెజర్‌మెంట్స్ కాంప్లిమెంటరీ ఫీడింగ్ కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. విద్యార్థినులు రుతుక్రమ శుభ్రత పాటించాలని, బాలింతలు, గర్భిణులు రక్తహీనత రాకుండా కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. 1 నుంచి 19 ఏళ్లలోపు వారు ఆల్‌బెండజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు ఆయేషాసుల్తాన్, ముబీన్, ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి రమేష్, ఏపీడయాలజిస్టు ఖాజామొహిద్దీన్, ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శారీరక అభివృద్ధికి పోషకాలు అందించాలి

అంగన్వాడీల్లో ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 5: పిల్లల శారీరక అభివృద్ధికి సరైన పోషకాలు అందించినప్పుడు పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్ వైజర్ భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం జంగంపేటలోని 1,2,3,4 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాల్లో పోషక పదార్థాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, విజలయలక్ష్మీ, శోభ, శ్రీదేవి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శంకరాపురంలో...

పెద్దశెట్టిపల్లె పంచాయితీ శంకరాపురంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. పిల్లలు కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వరప్రసాద్, సీహెచ్ఓ అంజలి ఏఎన్ఎం సుజాత అంగన్‌వాడీ వర్కర్లు గీతాలక్ష్మీ రాజ్యలక్ష్మీ మహాలక్ష్మీ పాల్గొన్నారు.

శ్రీరాములపేట అంగన్వాడీలో...

జమ్మలమడుగు, సెప్టెంబరు 5: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలని జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరిదేవి అన్నారు. మోరగుడి గ్రామం శ్రీరాములపేట అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గౌషియా, సునీత, అంగన్వాడీ కార్యకర్తలు గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఎంతో మేలు

పెద్దముడియం, సెప్టెంబరు 5: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు వెంకటలక్ష్మి తెలిపారు. పెద్దపసుపుల-1 కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ మహా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, నువ్వులు కొర్రలు తినాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం విజయమ్మ, బుజ్జి, ఆశావర్కర్లు పుల్లమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు హరిప్రియ, అపర్ణ, శ్రీదేవి, పార్వతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాజుపాలెం, సెప్టెంబరు 5: పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయేశ్వరి, లక్ష్మీదేవి అన్నారు. కొర్రపాడు, రాజుపాళెం అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు, కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

సోమాపురంలో...

చాపాడు, సెప్టెంబరు 5: అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను బోధించాలని చాపాడు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ అన్నారు. సోమాపురంలో అంగన్వాడీ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, ఓబుళమ్మ, కార్యకర్తలు రాధా, అరుణ, అంజనమ్మ, పాల్గొన్నారు.


పలుగురాళ్లపల్లెలో...

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 5: గర్భిణులు పోషకాహారాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ప్రత్యూష తెలిపారు. పలుగురాళ్లపల్లె క్లస్టరులో అంగన్వాడీ టీచర్లు, క్లస్టర్ బాలింతలు గర్భిణులు, కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలుగురాళ్లపల్లె క్లస్టర్ అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, గర్భిణు లు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



కుందూ నది వద్ద నిమజ్జనం

చాపాడు, సెప్టెంబరు 5: సీతారామపురం వద్ద కుందూ నదిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్, తహసీల్దారు రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. 7న శనివారం వినాయక చవితి పండుగ సందర్భంగా కుందూ నది వద్ద బారికేడ్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గురువారం వారు కుందూ నదిని, బ్రహ్మంగారి మఠంలో తెలుగుగంగను పరిశీలించారు. ఎన్ని ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకొస్తారని డీఎస్పీ ఎస్ఐ చిన్నపెద్దయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు.



కుందూ నదిని పరిశీలిస్తున్న పోలీసు , రెవెన్యూ అధికారులు

'జీఓ115ని వెనక్కు తీసుకోవాలి'

జమ్మలమడుగు, సెప్టెంబరు 5: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా గురువారం భోజన విరామ సమయంలో కాంట్రాక్టు వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జీఓ115 ఇచ్చారన్నారు. అందులో ఏఎన్ఎంలను స్టాఫ్‌నర్సు పోస్టుల్లో సర్దుబాటుకోసం ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. 15 ఏళ్లగా కాంట్రాక్టు పద్ధతిలోనే నియామకాలు జరుగుతున్నా రెగ్యులర్ నోటిఫికేషన్ విడుదల కాలేదన్నారు. అలాంటప్పుడు ప్రభుత్వం కాంట్రాక్టు వైద్య సిబ్బందిని ఇబ్బంది పెట్టేలా జీఓ తీసుకురావడం సమంజసమా అని ప్రశ్నించారు. జీఓను వెనక్కు తీసుకోకుంటే తాము రాష్ట్ర వ్యాప్తంగా విధులను బహిష్కరించి పోరాటాలకు దిగుతామన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించుకోండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 5: రిమాండ్ ఖైదీలు, ఇతర కక్షిదారులు పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప సెక్రటరి షేక్ బాబాఫకృద్దీన్ సూచించారు. సబ్‌జైలు ఆకస్మిక తనిఖీలో ఆయన రిమాండ్ ఖైదీల వసతులపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించి జడ్జి రికార్డులు తనిఖీ చేశారు. అక్కడి నుంచి జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులు సమావేశం అయ్యారు. 14వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు కార్యక్రమంలో జడ్జి బార్గవి, బార్ సెక్రటరి మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు భూతమాపురం సుబ్బారావు, రవి, బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పంటకాల్వల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 5: పంటల కాల్వలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేశారు. వెంకటేశ్వర స్కూలు వెనుక భాగంలో పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం వెళ్లే పంటకాల్వలను కొందరు ఆక్రమించుకోవడంతో పోరుమామిళ్లలో ఉన్న మురికినీరు, వర్షం నీరు గృహాల్లోని వ్యర్థ పదార్థాలు పోరుమామిళ్ల చెరువు నుంచి వచ్చే పంట కాల్వ నీళ్ల చేరడంతో ఆ ప్రాంతమంతా నీటికుంటలుగా తయారై చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి అంటురోగాలు ప్రబలే అవకాశాలున్నాయని వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి

చాపాడు, సెప్టెంబరు 5: మండల రైతులు సాగు చేసిన పంటలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏఓ మ్యాగి కోరారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి 1బి అడంగల్, సెల్‌ఫోన్ నంబర్లు వారికి ఇవ్వాలన్నారు. 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. వరి, పసుపు, వేరుశనగ, జొన్న వంటి పంటలు కేసీకెనాల్ కింద సాగు చేస్తున్నట్లు చెప్పారు.

పశు వ్యాధులకు ఉచిత చికిత్స

అట్లూరు, సెప్టెంబరు 5: వరికుంట గ్రామంలో గురువారం క్యాంపు నిర్వహించి పశువులను పరీక్షించి ఉచితంగా మందులు ఇస్తామని పశువైద్యాధికారి శిరీష తెలిపారు. ఏపీ ప్రభుత్వం పాడిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ గ్రామాల్లో పాడి రైతులకు చేయూతనివ్వాలని నేపథ్యంలో గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి సచివాలయం సిబ్బంది, అనిమల్ అసిస్టెంట్లు, గోపాల మిత్రల ద్వారా గాలికుంటు వ్యాధులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందిస్తామని సిద్దవటం ఏరియా డిప్యూటీ డైరెక్టరు లక్ష్మీదేవి తెలిపారు. కార్యక్రమంలో కడప డివిజన్ డిప్యూటీ డైరెక్టరు రమణయ్య, పశుగణాభివృద్ధి డిప్యూటీ డైరెక్టరు రమేష్, శివరామిరెడ్డి, కమలకూరు విద్యాధికారి ఈశ్వర్ ప్రసాద్, వరికుంట అనిమల్ అసిస్టెంటు కృష్ణ, గోపాలమిత్రలు వెంకటసుబ్బయ్య, అయ్యవారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలకు అనుమతులు తప్పనిసరి

బద్వేలుటౌన్, సెప్టెంబర్ 5: చవితి పర్వదినం పురస్కరించుకుని ఉత్సవ కమిటీలు తప్పక అనుమతులు తీసుకుని ఉత్సవాలు చేసుకోవాలని అర్బన్‌సీఐ రాజగోపాల్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నాయని, ముందస్తు అనుమతులు పొందాలని ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, సంబంధిత అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రతిష్టించే లా చూడాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలకు ప్రొద్దుటూరు సిబ్బంది

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 5: విజయవాడ ఘటనలో అపరిశుభ్రంగా మారిన ప్రాంతాలను పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ నుంచి కమిషనర్ జి రఘునాధరెడ్డి, ఈఈ సాయిక్రిష్ణ, డీఈలు ప్రభాకర్, దాస్, వెంకట రమణ, పది మంది సచివాలయ శానిటరీ సెక్రటరీలు, 60 మంది పారిశుధ్య కార్మికులు వెళ్లారు. వీరు మూడు రోజులుగా అక్కడ సహాయక సేవలను అందిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా ఆధ్వర్యంలో గురువారం మరో 60 మంది పారిశుధ్య కార్మికులు విజయవాడకు బయలు దేరి వెళ్లారు. దొరసానిపల్లె సోములవారిపల్లె కొత్తపల్లె గోపవరం పంచాయితీల కార్యదర్శులు మూడు రోజులుగా విజయవాడలో పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ లక్ష్మిదేవి



మైదుకూరు రూరల్,సెప్టెంబరు 5: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పి లక్ష్మిదేవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఏవైనా సమస్యలుంటే ప్రజలు స్వచ్ఛందంగా నేరుగా మాకు తెలపవచ్చని తెలిపారు. ప్రజా ప్రతినిధుల, అధికారుల సహకారంతో మండల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

పొలంలో కుంగిన నేల

మైదుకూరు (దువ్వూరు),సెప్టెంబరు 5: దువ్వూరు మండలం చింతకుంటలోని మారుకొండు శివ పొలంలో గురు వారం భూమి కుంగి పెద్ద గుంత ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019లో కూడా ఇదే పొలంలో భూమి కుంగడంతో సుమారు యాభై వేల రూపాయల ఖర్చు చేసి భూమిని పూడ్చుకున్నానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మళ్లీ ఇలా జరగడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో చోరీ

ఖాజీపేట, సెప్టెంబరు 5: ఆంజనేయకొట్టాలులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బుధవారం రాత్రి హుండీని దేవాలయం వెనుకభాగంలో తీసుకెళ్లి పగులకొట్టి అందులోగల కొద్దిమేర డబ్బు తీసుకెళ్లారన్నారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి

చాపాడు, సెప్టెంబరు 5: బూడిదపాడు వీఆర్ఏ కుచ్చుపాప రవి (50) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. వీఆర్ఏగా పనిచేస్తున్న రవికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

